కథ

# గ్లామర్

హెచ్. కామేశ్వరి

ఆరిన జుట్టు ముడేసుకుంటూ అద్దంలోకి చూసిన వాణి దీర్ఘంగా నిట్టూర్చింది. నలుపుతెలుపుల మిశ్రమంగా నువ్వులు బియ్యం కలగలిపినట్టు బూడిదరంగులో కనిపిస్తున్న శిరోజాలని చూస్తే విరక్తి అనిపించింది.

"ఇదేం నెరుపో! దిక్కుమాలిన గోల! ముప్పై ఏళ్లకే తల ముగ్గుబుట్ట అయిపోతోంది. బారెడు తలకట్టు తనది. అయితే ఏం లాభం? ఈ ఫలితకేశాలతో ఉన్న అందంకూడా పోయి అకాల వార్ధక్యం చుట్టుముట్టినట్టువుతోంది.

తన బాధేమిటంటే, తనకన్నా పెద్దవారైనా అక్కలకీ, వదినలకీ ఎవరికీ జుట్టు నెరవలేదు. తనకే ఈ బాధంతా! అందరూ వేళాకోళాలు, వెక్కిరింతలు, 'అందం' సీరియల్‌లో కృష్ణశ్రీలా ఉన్నావే అని పిచ్చిజోకులు. అన్నింటికన్నా తనని బాధపెట్టేది ఏమిటంటే తనభర్త చలపతి తనకన్నా పదేళ్లు పెద్ద ఆయన



జుట్టు నల్లగా నిగనిగలాడ్తుంటే తనకేమో తెల్లగా ధగధగా మెరిసిపోతోంది.

మొదట్లో రంగువేసుకోమని ఒకరిద్దరు సలహా ఇస్తే తనేమో లక్ష్యపెట్టలేదు. అందానికి తను ఇంపార్టెన్స్ ఇవ్వటం లేదనట్లు పెద్దగా ఫోజు పెట్టింది. ఇప్పుడు ఏభై ఏళ్ల తన మేనత్త కూడా తలకి రంగు వేసుకొని తనకన్నా గ్లామరస్‌గా, అందంగా కన్పిస్తుంటే సడన్‌గా తన స్టేట్‌మెంట్ మార్చి రంగు వేసుకోవాలంటే నామర్దాగా అనిపిస్తోంది.

పిల్లలు కూడా "మమ్మీ! నువ్వు ముసలిదానివై పోతున్నావు" అని అంటుంటే, అది విని ఆయన ముసిముసి నవ్వుతుంటే అరికాలి మంట నెత్తికెక్కుతోంది.

ఏ ఫంక్షన్‌కెళ్లినా పెద్దమ్మలు, చిన్నమ్మలు, అక్కలు అందరూ తన జుట్టు గురించి కామెంట్స్ "అదేంటే అప్పుడే అమ్మమ్మలా అయిపోయావు! జుట్టుంది కదాని మాటిమాటికి తలంట్లు పోసేసుకొని తగలెట్టేసుకున్నావు! వెధవ ఫ్యాషన్లు, తలకి నూనే రాయరు! ఇప్పుడు చూడు! ఏమయ్యిందో!" అంటూ తనజుట్టులా మిగతావారికి కూడా అయిపోతుందని భయపెట్టి జుట్టు గురించి జాగ్రత్తలు చెప్తున్న వెంకాయత్తయ్యని చూస్తే పీక నొక్కి చంపాలనిపించింది.

ఇంక రాజుబావ అయితే మరీ ఘోరం "నువ్వేమనుకున్నా కానీ చలపతీ! మీ ఆవిడ తలకట్టు చూసి మురిసిపోయి మనసు పారేసుకొని దాని జడమీద కవిత్వం చెప్పేవారిలో నేను కూడా ఒకడ్ని. జాతకాలు కుదరక కానీ! లేకపోతే ఈ ముసలమ్మ నా శ్రీమతి అయ్యేది! థాంక్‌గాడ్!" అని అంటుంటే తిక్కరేగింది.

కాని ఏం చేయుగలదు? ఎవరు ఏమన్నా పైకి నవ్వుతూ లోలోన బాధపడుతోంది. తన సమస్యకేమిటి పరిష్కారం? అనుకుంటుంటే తనఫ్రెండ్ శారద గుర్తుకువచ్చింది. శారద తనకన్నా పెద్దది, అయినా అప్‌టుడేట్‌గా ఉంటూ అందరికన్నా గ్లామర్ మెయింటైన్ చేస్తుంది,

అందులో బ్యూటీషియన్ ఏమో! ఎప్పుడూ అందం గురించే మాట్లాడుతుంది. దాన్ని కలిస్తే తప్పకుండా ఏదైనా సలహా ఇస్తుంది అనుకుంటూ ముడిని జడగా అల్లేసుకుని శారద దగ్గరకి బయల్దేరింది వాణి.

000

శారద వాణి చెప్పిందంతా విని రంగు వేసుకోమంది! వాణి దానికి ఒప్పుకోలేదు. "రంగు వేసుకునేటట్లయితే నీ దగ్గరకి రావడమెందుకూ! జుట్టు క్రమేణా నల్లబడటానికి నెరుపు తగ్గటానికి ఏదైనా చిట్కా చెప్పు" అంది.

"అయితే హెన్నా పెట్టుకో! హెర్బల్ కాబట్టి జుట్టుకి మంచిది" అని చెప్పి హెన్నా ఎలా పెట్టుకోవాలో వివరంగా చెప్పింది శారద. అవన్నీ శ్రద్ధగా నోట్ చేసుకుంది. జుట్టుకి రంగు వేసుకోవడం ఇష్టం లేదు. కనీసం ఇదైనా పనిచేసి తన జుట్టు రంగుమారితే అదేచాలు! అనకుంటూ ఇంటిదారి పట్టింది వాణి.

000

రాత్రి పదిగంటలయ్యింది. పిల్లలు నిద్రోతున్నారు. తలకి పెట్టుకొన్న హెన్నా కడిగేసుకుని చక్కగా తలంటు పోసుకుని "హమ్మయ్య! శారద చెప్పినట్లు చేశాను. రేపు ఈయన క్యాంప్ నుండి రాగానే తనని చూసి ఆశ్చర్యపోతారు. తను జుట్టు తీరు చూసి పూలంటేనే విరక్తి పుట్టి జడలో పూలు పెట్టుకోవడం మానేసింది. రేపు పూలు తెప్పించుకోవాలి!" అనుకుంటూ అందమైన తన జడని గురించి కలలుకంటూ తలారబెట్టుకుంటూ అలాగే నిద్రలోకి జారుకుంది వాణి.


మరునాడు క్యాంప్ నుండివచ్చిన చలపతి తలుపు తీసిన వాణిని చూసి ఆశ్చర్యం, నవ్వుతో కలగాపులగమైపోతూ "ఆ జుట్టేంటే! అలా అయిపోయింది, ఏం రాసావు?" అనడుగుతున్న భర్త ప్రశ్నకి వాణి నిద్రమత్తు అంతా ఎగిరిపోయింది. అయోమయంగా "ఏం బాగోలేదా! హెన్నా పెట్టుకున్నాను" అనంటున్న భార్యమాటలకి నవ్వుతో "ఏడిసినట్లుంది అద్దంలో చూసుకో! యూరోపియన్‌లా ఉన్నావు" అనంటుంటే కంగారుగా అద్దం దగ్గరకెళ్లి అద్దంలో చూసుకొన్న వాణి కళ్లు బైర్లు కమ్మినట్లయింది. ఎర్రగా రాగిరంగులో తన తలకట్టు అక్కడక్కడా నల్లని జుట్టుతో వికృతంగా కనిపించి "ఛీ... ఛీ... ఇదేమిటి? ఇలా అయ్యింది" అనంటూ శారదకి ఫోన్ చేసింది. అవతల శారద గొంతు వినగానే "ఏమిటే శారదా! నాచురల్‌గా ఉండేలా ఏదైనా చిట్కా చెప్పవే అంటే అదేదో రాయమన్నావు, రాసాను మొత్తం నా జుట్టంతా ఎర్రగా అసహ్యంగా అయిపోయింది, ఇప్పుడు నేనేం చేయాలి? నల్గురిలో ఎలా తిరగాలి?" ఉక్రోషంగా అర్చింది.

శారద వాణి మాటలకి విస్తుపోయి "నువ్వేకదా రంగువద్దు మరేదైనా చెప్పు అన్నావు. అయినా ముగ్గుబుట్టలా నెరిసిపోతుంటే హెన్నా ఏం పనికివస్తుంది? అలా బాగోలేదంటే హాయిగా కలర్ వేస్తాను నాదగ్గరికి రా!" అని ఫోన్ పెట్టేసింది.

'అంతా నాఖర్మ' అనుకుంటున్న భార్యని ఊరడిస్తూ "ఎందుకే ఇంత బాధ పడడం! హాయిగా కొంచెం నెరుస్తున్నప్పుడే తగిన జాగ్రత్త తీసుకొంటే బాగుండేదిగా! నువ్వేమో అది నా సమస్య కాదన్నట్లుగా ఫోజు కొట్టావు! ఇప్పుడు అందరూ ఏదో అంటున్నారని ఏదేదో చేస్తున్నావు. నీ అందం, నీ ఆరోగ్యం, నీ ఇష్టం వాటి గురించి తగిన జాగ్రత్త తీసుకోవడంలో తప్పు ఏమీ లేదు. ఇంకేం మాట్లాడకుండా పద!" అంటూ శారద దగ్గరకు తీసుకెళ్లాడు. కేవలం కొన్ని గంటలలోనే కృత్రిమంగానే అయినా నల్లగా నిగనిగలాడుతున్న తన తలకట్టు చూసుకోగానే వాణిలో ఆనందం పరవళ్లు త్రొక్కింది.

అయినా మనసులో ఏదోవెలితి, భర్త ఇంకా బాలకుమారిడిలా ఉన్నాడు. తానేమో ముప్పై ఏళ్లకే ముసలమ్మ కోవలోకి వచ్చేసిందే అన్నభావం ఆమెలో ముల్లుగా నాటుకుంది. అయితే అది తాత్కాలికమే! అని ఆక్షణంలో తెలియలేదు కాని,

మరో ఆరునెలలు తర్వాత ఎప్పుడిదో తిరుపతి మొక్కు వాణి బలవంతం మీద తీర్చుకున్నాడు చలపతి. ఒక్క నెల్లాళ్లకే తెల్లని వెంట్రుకల మొలకలతో బూడిద రంగులో నెరిసి మెరుస్తున్న భర్తగారి గుండుని చూసి తెల్లబోయింది వాణి.




భార్య సందేహం అర్థమైన చలపతి "పిచ్చిదానా! అయిదేళ్ల నుండి హెయిర్ కటింగ్‌కి వెళ్లినప్పుడే సెలూన్‌లో రంగేయించు కొని వస్తున్నానే! అదే ఇన్నాళ్ల నుండి నేను కాపాడుకొస్తున్న నా గ్లామర్ రహస్యం! చేస్తే అలా మెయింటైన్ చేయాలి మరి!" అంటూ నవ్వుతున్న భర్తని చూసి 'అమ్మదొంగా' అని ఆశ్చర్యపోయింది వాణి. ■